క్లుప్తంగా

స్వామివారి సన్నిధిలో రామానుజుల జయంతి



అంతర్వేది ఆలయంలో రామానుజుల జయంతి ఉత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి వారి సన్నిధిలో శుక్రవారం స్వామివారి భక్తుడు, విశిష్టాద్వైత మతస్థాపకులైన భగవత రామానుజుల తిరునక్షత్రం సందర్భంగా ఆయన జయంతిని అర్చకులు నిర్వహించారు. తొలుత ఆలయంలో ప్రత్యేక వేదికపై స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను కొలువు దీర్చి విశేష అర్చనలు చేశారు. అనంతరం స్వామివారి చెంతను ఉంచిన రామానుజుల విగ్రహం వద్ద ప్రబంధ సేవ నిర్వహించి, ఆయన జయంతిని ఘనంగా చేశారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, అర్చకులు పాల్గొన్నారు.


వైభవంగా బాలబాలాజీ పల్లకీ సేవ



బాలబాలాజీ స్వామి పల్లకీ సేవలో పాల్గొన్న ఈఓ రాజు, భక్తులు

మామిడికుదురు: పవిత్ర వైనతేయ గోదావరి నదీతీరం అప్పనపల్లి బాలబాలాజీ స్వామి ఆలయంలో శుక్రవారం పల్లకి సేవ వైభవంగా నిర్వహించారు. జగద్గురు శ్రీమాన్ రామానుజ జయంతి సందర్భంగా స్వామి, అమ్మ వార్ల ఉత్సవ మూర్తులను పల్లకీలో ఆలయం చుట్టూ ఊరేగిస్తూ ప్రదక్షిణ సేవ వేడుకగా జరిగింది. అనంతరం విశేషార్చన, అష్టోత్తర నామార్చన, సేవ కన్నులపండువలా జరిపించారు. ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు భక్తులతో కలసి ప్రదక్షణ సేవలో స్వయంగా పాల్గొన్నారు. దీంతో పాటు బాలబాలాజీ స్వామి, శ్రీ, భూదేవిలకు పంచామృతాలతో వారాభిషేకం జరిపించారు. స్వామి వారి మూల విరాట్‌కు శుక్రవారం సందర్భంగా ఈ పూజ వేడుకగా జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు ఈ పూజలో పాల్గొన్నారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం



దాతకు స్వామి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి చెయ్యేరు గ్రామానికి చెందిన శ్రీనివాస ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ దంతులూరి వెంకట నరసింహ సూర్యనారాయణవర్మ శుక్రవారం రూ.10,120 విరాళం అంజేశారు. దాత ఈ సొమ్ములను ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావుకు అందజేశారు. దాతను అర్చకులు వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. దాతను ఆలయ సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

ఎండుగడ్డి దగ్ధం



జి.అగ్రహారంలో దగ్ధమవుతున్న ఎండు గడ్డి

అంబాజీపేట: గంగలకుర్రు అగ్రహారం శివారు ఇందిరానగర్‌లో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో మూడు ఎకరాల ఎండు గడ్డి దగ్ధం కాగా రూ.25 వేల ఆస్తి నష్టం సంభవించింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దిగుమర్తి బాలరాజుకు చెందిన రూ.25 వేలు విలువ చేసే మూడు ఎకరాల ఎండు గడ్డిని తన ఇంటి పరసరాల్లో భద్రపరచుకున్నాడు. అటుగా వెళుతున్న గుర్తు తెలియన వ్యక్తి సిగరెట్ కాల్చి అక్కడ పాడేయడంతో గడ్డికి నిప్పంటుకుందన్నారు. దాంతో స్థానికులు స్పందించి మంటలను అదుపు చేశారు. అనంతరం అమలాపురం అగ్నిమాపక సిబ్బంది మంటలను నియంత్రించారు. సంఘటన స్థలాన్ని సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు పరిశీలించారు.

ధాన్యం లోడు ట్రాక్టర్ బోల్తా

ఆలమూరు: 216 ఏ జాతీయ రహదారిని జొన్నాడ వద్ద శుక్రవారం ధాన్యం లోడుతో వెళుతున్న ట్రాక్టర్ బోల్తా పడింది. స్థానికుల కథపం ప్రకారం కొత్తపేట గ్రామానికి చెందిన ఒక రైతు తానే స్వయంగా ట్రాక్టర్ నడుపుకుంటూ ధాన్యాన్ని దిగుమతి చేసుకునేందుకు రాయవరం బయలుదేరారు. స్థానిక జొన్నాడ జంక్షన్ వద్దకు వచ్చే సరికి ఫ్లైఓవర్ పనులతో అస్తవ్యస్తంగా తయారైన ఆరోడ్డులో ట్రాక్టర్ ట్రక్కు అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాద సమయంలో డ్రైవర్ తప్ప ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అయితే ట్రాఫిక్‌కు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది.

కిశోరి వికాసంపై బాలికలకు అవగాహన

- బాలికల రక్షణ, అభివృద్ధి కోసమే ఈ కార్యక్రమం
- వేసవి శిబిరాలను వినియోగించుకోవాలని సూచన



అయినవిల్లిలో కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

అయినవిల్లి: మండలంలోని అయినవిల్లి పంచాయతీ కార్యాలయంలో కిశోరి వికాసంపై కిశోర బాలికలకు మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ వారి ఆదేశాల మేరకు అంగన్‌వాడీ సిబ్బంది శుక్రవారం అవగాహన కల్పించారు. కార్యక్రమాన్ని సర్పంచ్ కాకర శ్రీనివాస్ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ బాలికలు కౌమార బాలికల సాధికారత వైపు పయనించాలన్నారు. ఇందుకోసం ప్రభుత్వం ఈ నెల పదో తేదీ వరకూ ఏర్పాటు చేసిన వేసవి శిబిరాలను వినియోగం చేసుకోవాలని బాలికలను ఆయన కోరారు. కార్యక్రమంలో మహిళ పోలీసు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

కొర్లపాటివారిపాలెంలో..

అంబాజీపేట: బాలికల రక్షణ, వారి అభివృద్ధి కిశోరి వికాసం కార్యక్రమ ముఖ్య లక్ష్యాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేట కొర్లపాటివారిపాలెంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎంవీఎస్‌వీ మహాలక్ష్మి అధ్యక్షతన కిశోరి వికాసం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ 11 నుంచి 18 ఏళ్ల లోపు బాలికలను, డ్రాపౌట్లను గుర్తించి గ్రూపులుగా తయారు చేసి శిక్షణ ఇస్తారన్నారు. ఈ శిక్షణను కిశోరి బాలికలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాలు ఈ నెల 10వ తేదీ వరకు వివిధ అంశాలపై శిక్షణ ఇస్తామని సూపర్‌వైజర్ మహాలక్ష్మి తెలిపారు. అనంతరం పాంప్లేట్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ భూలక్ష్మి, హెచ్‌వీ శాంతకుమారి, ఆశాలు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అవిడిలో..

కొత్తపేట: కిశోరి బాలికలకు సరైన విజ్ఞానం అందించి జీవితంలో అన్ని విధాలా ఎదిగేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరముందని అవిడి సర్పంచ్ రెడ్డి చంటి అన్నారు. స్థానిక ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవిడిలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చంద్రకళ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డి చంటి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సూపర్‌వైజర్ కార్యక్రమం గురించి వివరిస్తూ వేసవిలో కిశోరి బాలికలు ప్రతి మంగళ, శుక్ర వారాలు, మే 2వ తేదీ నుంచి జూన్ 10వ తేదీ వరకు జరిగే వేసవి క్లాసులకు హాజరై వారు చెప్పే పర్సనల్ హైజిన్, కెరీర్ గైడెన్స్, బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలు మొదలైన అంశాల గురించి అవగాహన ఏర్పరచుకోవాలని వివరించారు. సర్పంచ్ చంటి మాట్లాడుతూ ఇది బాలికల బంగారు భవిష్యత్తుకు పునాది వేస్తుందని, ఉజ్వల, ఆరోగ్యకరమైన, సాధికారత దిశగా ఆమె వేసే అడుగుకు సమష్టి కృషితో చేయూతనిద్దామని అన్నారు.

పాశర్లపూడిలో..

మామిడికుదురు: బాలికలు ప్రతి ఒక్కరూ చదువుకోవాలని ఆయుర్వేద వైద్యురాలు బి.కనకదుర్గ పేర్కొన్నారు. కిశోరి వికాసం-2లో భాగంగా శుక్రవారం మామిడికుదురు, పాశర్లపూడి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక, అప్పనపల్లి, పాశర్లపూడిలంక గ్రామాల్లో కిశోరి వికాసం కార్యక్రమం జరిగింది. దీనిలో భాగంగా బాలికలకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. విద్య, ఆరోగ్య, పోషకాహారం, మానవ అక్రమ రవాణా, ఆత్మ రక్షణ, జీవనోపాధి అవకాశాలు, బాల్య వివాహాల నిర్మూలన తదితర అంశాలను వివరించారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్‌లు కొనుకు ప్రేమజ్యోతి, చెల్లుబోయిన రామశివ సుబ్రహ్మణ్యం, గెద్దం మంగాలక్ష్మి, తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, ఎంపీటీసీ కొమ్ముల జంగమయ్య, ఐసీడీఎస్ ఉద్యోగులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన సదస్సు

సఖినేటిపల్లి: పిల్లలపై అకృత్యాలను అడ్డుకోవడం కోసం పోక్సో చట్టం అన్ని విధాలుగా పూర్తి రక్షణ కల్పిస్తుందని ఐసీడీఎస్ సీడీపీఓ వైకేడీ రమాదేవి అన్నారు. శుక్రవారం అప్పనరామునిలంకలో కిశోరి వికాసం పేరిట తొమ్మిది రోజుల పాటు నిర్వహించే వేసవి శిబిరాన్ని రమాదేవి ప్రారంభించారు. అనంతరం పంచాయతీ వద్ద సర్పంచ్ ఇందుకూరి సుబ్బరాజు అధ్యక్షతన పోక్సో చట్టంపై కిశోరి బాలికలతో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో ఆమె మాట్లాడుతూ, పోషకాహారం, వ్యక్తిగత పరిశుభ్రత, బాల్య వివాహాలు, అక్రమ రవాణా వంటి విషయాలపై అవగాహన కల్పించారు. బేటీ బచావో, బేటీ పఢావో కార్యక్రమంపై గ్రామంలో వారితో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీపీ వీరా మల్లిబాబు, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు మున్నీసా, కీర్తి, ఏఎన్‌ఎం కాంతకుమారి, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, సీహెచ్.పెద్దిరాజు పాల్గొన్నారు.

ఆలమూరులో..

ఆలమూరు: కిశోరి బాలికల వికాసాన్ని అందరూ బాధ్యతగా తీసుకుందామని ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి అన్నారు. మండలంలోని చొప్పెల్లలో నిర్వహించిన కిశోరి బాలికల వికాసం-2 వేసవి శిక్షణ తరగతులను గురువారం వారు ప్రారంభించారు. ఆలమూరులోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ నేలపూడి లావణ్య అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కొత్తపేట ఐసీడీఎస్ సీడీపీఓ అధికారి గజలక్ష్మి పాల్గొని ప్రసంగించారు. ఈనెల 02 నుంచి జూన్ 10 వరకూ ఈ వేసవి శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. ఈ శిక్షణ తరగతుల ద్వారా కిశోరి బాలికలు నేర్చుకున్న అంశాలను భవిష్యత్‌కు బాటలు వేసుకుని ఆత్మస్థైర్యంతో జీవించాలన్నారు. జూన్ 4న మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి కిశోరి బాలికలపై తీసుకోవలసిన జాగ్రత్తలు, అనుసరించవలసిన అంశాలపై చర్చించి అభిప్రాయాలను తీసుకుంటామన్నారు. బాలికలు ఒకరినొకరు పరిచయం చేసుకోవడం. బాలల హక్కులు రక్షణ పీఓసీఎస్ఓ చట్టం గురించి అవగాహన, ఆర్థిక అంశాల నిర్వహణ, పొదుపు, కౌమార బాలికల నాయకత్వం, సాధికారత పలు అంశాలపై 40 రోజుల పాటు అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి క్షేత్రస్థాయిలో ఏఎన్‌ఎం, మహిళ పోలీసు, అంగన్‌వాడీ కార్యకర్తలు, రెవెన్యూ శాఖాధికారులు, ఆశ, యానిమేటర్లు, మహిళ గ్రామ సమాఖ్య సభ్యులు సభ్యులుగా ఉంటారని వారు పేర్కొన్నారు. అలాగే మండలంలోని 24 గ్రామ సచివాలయాల పరిధిలో ఆయా గ్రామాల సర్పంచ్‌ల ఆధ్వర్యంలో కిశోరి బాలికల వికాసం-2 ప్రారంభమైంది. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు టీఎస్‌వీ నాగలక్ష్మి, వై.అరుంధతి, బి.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



అవిడిలో కిశోరి బాలికల శిక్షణ పుస్తకాలు ఆవిష్కరిస్తున్న సర్పంచ్ రెడ్డి చంటి



పాశర్లపూడిలో జరిగిన కిశోరి వికాసంలో పాల్గొన్న డాక్టర్ కనకదుర్గ



అప్పనరామునిలంకలో బేటీ బచావో, బేటీ పఢావో కార్యక్రమంపై నిర్వహిస్తున్న ర్యాలీ



ఆలమూరులో కిశోరి బాలికల వికాసం-2 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న గ్రామ సచివాలయ, ఐసీడీఎస్ సిబ్బంది

వెన్నుచూపని పోరాటయోధుడు స్వామినాయుడు



కొత్తపేటలో స్వామినాయుడు విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎంపీపీ గంగాధరరావు తదితరులు

కొత్తపేట: మాజీ ఎంపీపీ, రాష్ట్ర కాపు రిజర్వేషన్ పోరాట సమితి నాయకుడు సలాది స్వామినాయుడు (అబ్బాయికాపు) ప్రజా సమస్యలపై, ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై స్పందించి వెన్ను చూపని పోరాడిన యోధుడిగా చరిత్రలో నిలిచిపోయారని వివిధ రాజకీయ పార్టీల నాయకులు అన్నారు. స్వామినాయుడు వర్ధంతి సందర్భంగా మండలంలో వివిధ రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. స్థానిక పాతబస్టాండ్ సెంటర్‌లో అబ్బాయికాపు విగ్రహానికి ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, రాష్ట్ర టీడీపీ నాయకుడు ఆకుల రామకృష్ణ, రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందరావు, మండల టీడీపీ అధ్యక్షుడు కంఠంశెట్టి శ్రీనివాసరావు, సర్పంచ్ బూసి జయలక్ష్మి, జనసేన నాయకుడు సలాది రామకృష్ణ, జనసేన మండల శాఖ అధ్యక్షుడు కంఠంశెట్టి చంటి తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ మార్గన గంగాధరరావు ఆధ్వర్యంలో, సంతోష్‌నగర్‌లో ఎంపీటీసీ సభ్యుడు పేపకాయల బ్రహ్మానందం, గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సలాది బ్రహ్మాజీ ఆధ్వర్యంలో స్వామినాయుడు విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమాల్లో జీబీహెచ్ పీఎంసీ మాజీ చైర్మన్ బీర శ్రీనివాసరావు, స్థానిక నాయకులు చోడపనీడి శ్రీనివాసరావు, తిరుపతి వెంకటేశ్వరరావు, నూకల శివ తదితరులు పాల్గొన్నారు. అలాగే కొత్తపేట శివారు బొరుసువారిసావరం, ఏనుగుల మహల్ గ్రామాల్లో సలాది విగ్రహాలకు ఆయా గ్రామాల నాయకులు, ఆయన అభిమానులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఉత్తమ ఉపాధ్యాయులను సమాజం మరవదు



ఆనందరావు దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

పి.గన్నవరం: ఉత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయులను సమాజం ఎన్నటికీ మరువదని కోనసీమ సైన్స్ పరిషత్ అధ్యక్షుడు సీవీ సర్వేశ్వర శర్మ అన్నారు. పోతవరం ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎంగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కత్తుల ఆనందరావును బుధవారం పాఠశాలలో ఎస్ఎంసీ కమిటీ, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సమావేశంలో శర్మ మాట్లాడారు. ఆనందరావు ఏ పాఠశాలలో పనిచేసినా, ఆ పాఠశాల రూపురేఖలు మార్చి వేశారని పలువురు అభినందించారు. దాతల సాయంతో పాఠశాలలకు మౌలిక సదుపాయాల కల్పనతో పాటు, విద్యార్థులకు విద్యా సామగ్రి అందించేవారని, ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువ మంది పిల్లలు చేర్చేలా తల్లిదండ్రుల్లో చైతన్యం తీసుకువచ్చేవారని ప్రశంసించారు. సర్పంచ్ వదలి కొండయ్య, ఎంపీటీసీ పులపర్తి రాజారావు, ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ కోట రామకృష్ణ, హెచ్ఎం బీసీహెచ్ మల్లికార్జునరావు, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పి.దొరబాబు, ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ పల్లంరాజు, ఎస్సీ వెల్ఫేర్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.బంగార్రాజు, ముంగండ కాంప్లెక్స్ జాయింట్ సెక్రటరీ నల్లా నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

సికిల్‌సెల్‌పై అవగాహన కలిగి ఉండాలి



పెదపళ్ల పీహెచ్‌సీలో సికిల్‌సెల్ ఎనీమియాపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ, వైద్యుడు

ఆలమూరు: సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీఓ ఎ.రాజు, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డి.సాయి కిషోర్ అన్నారు. స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో వైద్యాధికారి సాయికిషోర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సికిల్‌సెల్ అవగాహన సదస్సులో ఎంపీడీఓ రాజు పాల్గొని ప్రసంగించారు. జాతీయ స్థాయిలో సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలన లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఈ వ్యాధి లక్షణాలు-తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. అలాగే ప్రభుత్వ ఆస్పత్రుల్లో సికెల్‌సెల్ ఎనీమియాకు సంబంధించిన పరీక్షలు అందుబాటులో ఉన్నాయన్నారు. సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి వంశ పారంపర్యంగా వస్తుందన్నారు. ఎర్ర రక్తకణాలు కొడవలి ఆకారంలో మారి రక్తనాళాలలో ప్రయాణం చేయలేక శరీరంలో నొప్పులు ఎక్కువ అవుతాయని వివరించారు. క్షేత్రస్థాయిలో వైద్య ఆరోగ్య సిబ్బంది సికెల్‌సెల్ ఎనీమియా వ్యాధిపై విస్తృత అవగాహన కల్పిస్తున్నారన్నారు. వ్యాధి లక్షణాలు కనిపిస్తే సత్వరమే వైద్యులను సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అనంతరం సికిల్ సెల్ ఎనీమియాపై హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా అక్కుల, సీహెచ్ఓ ఎంఎస్ఎన్ రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.ఉమ తదితరులు పాల్గొన్నారు.

అభిరుచికి అనుగుణంగా చదువుకోవాలి



మామిడికుదురులో ప్రతిభావంతులను సన్మానిస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు

మామిడికుదురు: విద్యార్థులు తమ అభిరుచికి అనుగుణంగా చదువుకుని అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని ఎంఈఓలు ఎస్.లక్ష్మీనారాయణ, మోకా వెంకన్నబాబు పేర్కొన్నారు. మామిడికుదురు ఎమ్మార్సీలో శుక్రవారం పదో తరగతి పరీక్షల్లో మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన జెడ్పీహెచ్ స్కూల్ విద్యార్థులను ఘనంగా సత్కరించారు. మొగలికుదురు జెడ్పీహెచ్ స్కూల్ విద్యార్థులు కె.మహాలక్ష్మి (586), కె.శ్రీకళ (586), మామిడికుదురు జెడ్పీహెచ్ స్కూల్ విద్యార్థిని కుష్బూమ్ జహార (576), లూటుకుర్రు జెడ్పీహెచ్ స్కూల్ విద్యార్థిని బోనం సత్యమౌలిక (574) మార్కులు సాధించారు. వారికి మెమెంటోలు అందించి శాలువాలతో సత్కరించారు. కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు సీహెచ్ నిరంజని, పీఎస్ చక్రవర్తి, పేరెంట్స్, ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కోఆర్డినేటర్ పరామర్శ



మహాలక్ష్మిని పరామర్శిస్తున్న శ్రీనివాసరావు

అయినవిల్లి: మండలంలోని శంకరాయగూడెం క్రాప పాలెంకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు గుత్తుల మహాలక్ష్మిని పి.గన్నవరం నియోజక వర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు శుక్రవారం పరామర్శించారు. గుత్తుల మహాలక్ష్మి ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయాలు పాలై కాకినాడ 7 హిల్స్ ఆస్పత్రిలో మోచిప్ప మార్పిడి చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. కోఆర్డినేటర్‌తో పాటు పలువురు పార్టీ ప్రముఖులు పరామర్శించారు.

ఎన్‌హెచ్‌ఆర్‌సీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా 'గారపాటి'



ఆలమూరు: రాష్ట్ర నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మండలం పెదపళ్లకు చెందిన గారపాటి శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఢిల్లీ శాఖ ఉత్తర్వులు వెలువరించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎంపికైన గారపాటి ప్రస్తుతం చింతలూరు సాగునీటి సంఘం అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. ఎన్‌హెచ్‌ఆర్‌సీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎంపికైన గారపాటిని పలువురు అభినందించారు.

ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

మలికిపురం: విద్యాహక్కు చట్టం ప్రకారం 2025-26 విద్యా సంవత్సరానికి ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు కేటాయించిన 25 శాతం ఉచిత ప్రవేశాలకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంఈఓ ఎం.విజయశ్రీ శుక్రవారం తెలిపారు. ఒకటో తరగతిలో ప్రవేశాలకు ఏప్రిల్ 28 నుంచి జరగాల్సిన దరఖాస్తుల స్వీకరణ కొన్ని అనివార్య కారణాల వల్ల మే 2 నుంచి మే 19 వరకు మార్పు చేసినట్లు సమగ్ర శిక్షా ఎస్పీడీ బి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారని ఆమె పేర్కొన్నారు. లాటరీ విధానంలో మొదటి విడత ఫలితాలను మే 29న విడుదల చేసి సీట్లు సాధించిన విద్యార్థుల ప్రవేశాల నిర్ధారణ జూన్ 8న ఖరారు చేస్తారన్నారు. రెండో విడత ఫలితాలను జూన్ 11న విడుదల చేసి, సీట్లు సాధించిన విద్యార్థుల ప్రవేశాల నిర్ధారణ జూన్ 18న ఖరారు చేస్తారని ఆమె వివరించారు.

శిథిల స్థితిలో కల్వర్టు

- శంకరగుప్తం డ్రెయిన్‌పై పొంచి ఉన్న ప్రమాదం
- నూతన కల్వర్టు నిర్మించాలని స్థానికుల విన్నపం
- పలు గ్రామాల వాసులకు ఇదే ఆధారం



మెండుపాలెం వద్ద శిథిల కల్వర్టు మీదుగా ఉన్న రహదారి

సఖినేటిపల్లి: కేశవదాసుపాలెం గ్రామ శివారు మెండుపాలెం వద్ద శంకరగుప్తం మేజర్ డ్రెయిన్‌పై పూర్వం నిర్మించిన కల్వర్టు పూర్తి శిథిల స్థితికి చేరింది. అలాగే కల్వర్టు రక్షణ గోడలు సైతం పూర్తిగా దెబ్బతిన్నాయి. శిథిల స్థితికి చేరుకున్న కల్వర్టు స్థానే కొత్త కల్వర్టును నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

తీరం వెంబడి గ్రామాలకు..

సఖినేటిపల్లి మండలంలోని పల్లిపాలెం, అంతర్వేది దేవస్థానం, అంతర్వేదికర, కేశవదాసుపాలెం, మలికిపురం మండలం చింతలమోరి, శంకరగుప్తం, పడమటిపాలెం, కేశనపల్లి, తూర్పుపాలెం, గొల్లపాలెం, మామిడికుదురు మండలం కరవాక వరకూ తీర ప్రాంత గ్రామాల ప్రజలు రాకపోకలకు ఎంతో అనువుగా ఈ కల్వర్టును అప్పట్లో నిర్మించారు. తీరం వెంబడి సుమారు 25 కిలోమీటర్ల మేర పై గ్రామాల ప్రజలు, రైతులు రాకపోకలు సాగించడానికి ఈ కల్వర్టు ఎంతో కీలకంగా ఉంది. అయితే ఇటీవల కాలంలో పూర్తిగా శిథిల స్థితికి కల్వర్టు చేరుకుంది. తీరంలో ప్రత్యామ్నాయ దారిలేక శిథిలమైన కల్వర్టు మీదుగానే పలు రకాల లోడ్‌లతో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. సామర్థ్యం దెబ్బతిన్న ఈ కల్వర్టు ఎప్పుడైనా కూలిపోవడానికి సిద్ధంగా ఉందని స్థానికులు చెబుతున్నారు.

పునర్నిర్మించాలి

శిథిల స్థితికి చేరిన కల్వర్టు పునర్నిర్మాణంపై అధికారులు దృష్టి పెట్టాలి. తీర ప్రాంతాలకు కీలకంగా ఉన్న కల్వర్టును కొత్తది నిర్మించాలి. దెబ్బతిన్న కల్వర్టు మీదుగా రాకపోకలు సాగిస్తున్న వాహనాలకు ప్రమాదం పొంచి ఉంది.

– రావి ఆంజనేయులు, అంతర్వేదికర

సామర్థ్యం దెబ్బతింది

మెండుపాలెం వద్ద శంకరగుప్తం మేజర్ డ్రెయిన్‌పై కల్వర్టు సామర్థ్యం పూర్తిగా దెబ్బతింది. ఇటీవల కాలంలో కల్వర్టు శ్లాబ్‌కు పెద్ద రంధ్రం కూడా పడింది. తీర ప్రాంత గ్రామాలను కలుపుతూ ఉన్న ఏకైక మార్గం ఇదే.

– యెనుముల చిట్టిబాబు, కేశవదాసుపాలెం

పునర్నిర్మాణానికి ప్రతిపాదనలు

మెండుపాలెం వద్ద డ్రెయిన్‌పై కల్వర్టు పునర్నిర్మాణ పనులకు సంబంధించిన ప్రతిపాదనలు వెళ్లాయి. రూ.కోటి యాభై లక్షలకు ప్రతిపాదిస్తూ పూర్తిగా కల్వర్టు రీ కన్‌స్ట్రక్షన్‌కు ప్రతిపాదనలు పంపాం.

– సురేష్, ఆర్అండ్‌బీ, జేఈ, రాజోలు

పూడికతీతతో చెరువుల అభివృద్ధి



పినపళ్లలో చెరువు పూడికతీత పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ సుభాష్ తదితరులు

ఆలమూరు: ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో అమృత్ సరోవర్ పథకం కింద పూడికతీత పనులను ప్రారంభించి చెరువులను అభివృద్ధి చేయడంతో పాటు ఉపాధి కూలీలకు అండగా కూటమి ప్రభుత్వం ఉందని సర్పంచ్ సంగిత సుభాష్, ఏపీఓ జి.అరుణకుమారి అన్నారు. మండలంలోని పినపళ్లలో గురువారం రూ.22.37 లక్షలతో చేపట్టనున్న ఈ చెరువు పూడికతీత పనుల్లో సుమారు 6500 పని దినాలను ఎన్‌ఆర్‌ఈజీఎస్ కల్పించిందన్నారు. పేదలకు వెన్నుదన్నుగా ఉండేందుకు ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని ఉపాధి కూలీలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామ కార్యదర్శి ఎస్.వీర్రాజు, ఫీల్డ్ అసిస్టెంట్ ఇల్లూరి శ్రీనివాసు, చామకూరి ధనరాజు తదితరులు పాల్గొన్నారు.